



క్యాంటీన్‌ను సందర్శిస్తున్న డాక్టర్లు

క్యాంటీన్ 'లీజు' వ్యవహారంపై ఆగ్రహం

-లీజ్ సమయం పూర్తయినా కొనసాగింపు
-మెడికల్ కాలేజీ క్యాంటీన్ వెంటనే అప్పగించాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీలో ఉన్న క్యాంటీన్ లీజు కాల పరిమితి ముగిసినా లీజుదారుడు డాక్టర్ వరప్రసాద్ అక్రమంగా నిర్వహిస్తూ రూ.లక్షలు సంపాదిస్తూ అసోసియేషన్‌కు ఆర్థికంగా నష్టం చేస్తున్నాడని ఎపి గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బ్రాహ్మజీ మాస్టర్, జనరల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సోమ్మప్ప అన్నారు. మంగళవారం ఎపి జిడి ఎ బృందం మెడికల్ కళాశాల క్యాంటీన్ సందర్శించింది. వారు మాట్లాడుతూ 2012లో అప్పటి కలెక్టర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌కు స్థలాన్ని అప్పగించారన్నారు. ఈ స్థలంలో గెస్ట్ హౌస్ క్యాంటీన్ నిర్మాణం చేసుకొని సిబ్బంది కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. 2012లో క్యాంటిన్ ను 5 సంవత్సరాల లీజుకు డాక్టర్ వరప్రసాద్ కు ఇచ్చారని తెలిపారు. ప్రతి నెల అద్దె రూ 4 వేలు ఇస్తూ రెండు సంవత్సరాలకు 10 శాతం అద్దె పెంచి ఇవ్వాలని తీర్మానం చేశారు. 2017 కు లీజ్ సమయం పూర్తయింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 10 శాతం అద్దెపెంచి ఇవ్వలేదని తెలిపారు. 2017 లోనే లీజు గడువు ముగిసినా రెన్యూవల్ కుడా చేయడం లేదని, చాలా సంవత్సరాలుగా క్యాంటిన్ ను ఖాళీ చేయడం లేదని తెలిపారు. డాక్టర్ వరప్రసాద్ ఇతరులకు నెలకు రూ 75 వేల చొప్పున సబ్ లీజ్‌కు యిచ్చి వసూలు చేస్తూ కాలేజీకి, అసోసియేషన్ కు నష్టం చేస్తున్నారని తెలిపారు. గతంలో కుడా చాలా సార్లు ఖాళీ చేయమ చెప్పినా విన లేదన్నారు. మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో దాదాపు 4 వేల మంది దాక ప్రొఫెసర్, డాక్టర్, పీజీ, ఎంబిబిఎస్ విద్యార్థులు క్యాంటిన్‌లో టీ, అల్పాహారం, భోజనం చేస్తుంటామని పేర్కొన్నారు. గత 15 నెలలుగా వైద్య సిబ్బందిని, విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం రిటైర్డ్ అయిన డాక్టర్ వరప్రసాద్ క్యాంటిన్ నిర్వహించడానికి అర్హత లేదని అన్నారు. ఫోర్జరీ సంతకాలతో 30 సంవత్సరాలు లీజ్ గడువుందని మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే 48 గంటల్లోపు క్యాంటీన్‌ను ఖాళీ చేసి మాకు అప్పగించాలని లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ హెచ్ఒడి డాక్టర్ సాయి సుధీర్, ప్రొఫెసర్స్ ఎపి జిడిఎ కోశాధికారి డాక్టర్ దండం శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి డాక్టర్ శారద, ఇసి మెంబర్ డాక్టర్ రంగయ్య, డాక్టర్ వినోద్, డాక్టర్ అబ్దుల్ రహీం, డాక్టర్ విద్యాసాగర్, పీజీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వల..!

- వేట మొదలుపెట్టిన కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు
- రాయితీల పేరుతో ఉక్కిరిబిక్కిరి
- విసిగిస్తూ వెంటాడుతున్న వైనం



కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నాయి. గత నెల నుంచే ఎల్‌కెజి, నర్సరీ తరగతులకు అడ్మిషన్ల కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో టీచర్లు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం వెంట పడుతున్నారు. జూనియర్ కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల గురించి వివరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ విసిగిస్తూ వెంటాడుతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరిస్తుంటాయి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడ్మిషన్ రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు, 82 ప్రయివేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కాలేజీలలో ఫలితాలు తలకిందులైన నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులు యోచిస్తున్నారు. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామని ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లను ప్రయివేటు సంస్థల ప్రతినిధులు, ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులు స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళుతున్నారు. తమ కళాశాలలో చేర్పితే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు. కర్నూలు జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, అందులో చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రయివేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు.

సంబంధిత కళాశాలలపై చర్యలు

ప్రయివేటు కళాశాలల వారు ఎవరైనా విద్యార్థులను, తల్లిదండ్రులను బలవంతపెట్టి అడ్మిషన్లు చేయిస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

- గురవయ్య శెట్టి, ఆర్ఐఓ.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నాం

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. ఎవరైనా ప్రయివేటు విద్యా సంస్థల ప్రతినిధులు బలవంతంగా అడ్మిషన్లు చేయిస్తున్నట్లు మా దృష్టి తెస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- శామ్యూల్ పాల్, డిఈఓ.

చేనేతలకు స్వర్ణయుగం



రాష్ట్రంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని, నేతన్నకు 365 రోజులు పని కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత అండ్ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఎమ్మిగనూరు మండలం బనవాసిలో ఎంఎస్ఎంఇ కింద మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి మంత్రులు ఎన్ఎండి.ఫరూక్, టిజి.భరత్, సవిత, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి భూమి పూజ చేశారు. వార్త మెయిన్‌లో



రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

- ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

జిల్లాలో రైతులు సాగుచేసిన పొగాకు పంటను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 8న కలెక్టరేట్ ముందు జరిగే పొగాకు రైతుల ధర్నాను జయప్రదం చేయలన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో ఉన్న పొగాకు కంపెనీలను ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ పరిశీలించారు. అనంతరం పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో పొగాకు కంపెనీలు రైతుల వద్ద గ్రామాలలో మీటింగులు వేసి పొగాకు నాటాలని రైతులకు చెప్పి ఇప్పుడు పొగాకు ఎక్కువైందని కొనుగోలు చేయలేమని అనడం సరైన పద్ధతి కాదన్నారు. గత సంవత్సరం రూ.16 నుండి 18 వేల వరకు పొగాకు కొనుగోలు చేశారన్నారు. నలకతో సహా కొనుగోలు చేశారని, ఈ సంవత్సరం పొగాకు ఎక్కువైందనే పేరుతో రూ.పదివేలు, రూ.పన్నెండు వేలు ధరకు కొంటున్నారన్నారు. చిన్న సన్నకారు రైతులను ప్రైవేటు కంపెనీలు మోసం చేసి రూ.కోట్లు దండుకుంటుంటే ప్రభుత్వం చూసి చూడనట్టు వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న పొగాకు కంపెనీలన్నీ రైతుల వద్ద ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 8 న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే పొగాకు రైతుల ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, సిఐటియు మండల నాయకులు వి.సుధాకర్ పాల్గొన్నారు, పొగాకు రైతు మల్లేష్, వివిధ గ్రామాల పొగాకు రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ మంజూరులో వివక్ష...

- బీసీలకు ముందస్తు సబ్సిడీ - ఎస్‌సిలకు చివరలో చెల్లింపు
- ప్రభుత్వ విధానంపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాల్లో అనుసరిస్తున్న విధానం పలు విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో 2025 -26 సంవత్సరానికి గాను ప్రభుత్వం ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక తరగతుల పేదల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా, వారికి స్వయం ఉపాధిని కల్పించేందుకుగాను బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు జిల్లాలో ఇప్పటికే ఆయా కార్పొరేషన్ల ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసి వివిధ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ మేరకు జిల్లాలో ఎస్‌సి కార్పొరేషన్ 973 యూనిట్ల లక్ష్యంగా రూ.40.73 కోట్లతో... బీసీ కార్పొరేషన్ 2223 యూనిట్ల లక్ష్యంగా.. రూ.50 కోట్లతో యాక్షన్ ప్లాన్ ను రూపొందించింది. ఇప్పటికే బిసి కార్పొరేషన్ దరఖాస్తుల గడువును పూర్తి చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కూడా ప్రారంభించింది. కాగా ఎస్సీ కార్పొరేషన్ మార్చి, ఏప్రిల్ 14వ తేదీన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. ఈనెల పదవ తేదీతో ఆ గడువు ముగియనుంది. లక్ష్యం మాట అటు ఉంచితే... సబ్సిడీని లబ్ధిదారులకు విడుదల చేయడంలో అనుసరిస్తున్న విధానంలో వ్యత్యాసమే ప్రస్తుతం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రధానంగా రుణాలలో సబ్సిడీ పాత్ర అత్యంత కీలకమైంది. లబ్ధిదారుడు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను నిర్వహించడంలో సబ్సిడీ ఆసరాగా నిలుస్తుంది. ఏవైనా ఒడిదుడుకులు ఎదురైనప్పుడు వాటి నుంచి కొంత ఉపశమనం కల్పించాలన్నది దాని అసలు లక్ష్యం కూడా. సబ్సిడీని లబ్ధిదారులకు యూనిట్‌ను మంజూరు చేసిన సమయంలో బ్యాంకు రుణంతోపాటు కలిపి ముందస్తుగానే చెల్లిస్తే దాని లక్ష్యం నెరవేరడానికి ఆస్కారం ఉంటుంది. కానీ ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ లో అమలు చేస్తున్న బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాల్లో రుణం తీసుకున్న లబ్ధిదారుడు బ్యాంకు రుణం చెల్లించిన తరువాతనే సబ్సిడీని లబ్ధిదారుని ఖాతాకు వేసే విధంగా ప్రస్తుత రుణ అమలు విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీన్నే బ్యాక్ ఎండ్ సబ్సిడీ విధానం అని పిలుస్తారు.

ఎస్‌సిలకు తీరని అన్యాయం : సామాజికంగా ఎస్సీలు అత్యంత వెనుకబాటుతనాన్ని, వివక్షత అనుభవిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. అందులో భాగంగా ఎస్‌సిల అభివృద్ధికి ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాజ్యాంగమే ప్రత్యేక హక్కులను కల్పించింది. సబ్సిడీ విషయంలో అందుకు పూర్తి భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బిసి కార్పొరేషన్‌లో లబ్ధిదారులకు బ్యాంకు రుణంతోపాటు సబ్సిడీని చెల్లించే విధానం అమలు చేస్తుండగా, ఎస్‌సి కార్పొరేషన్ లో మాత్రం అందుకు భిన్నంగా రూ. రెండు లక్షలు వరకు రుణం తీసుకున్న వారు రెండేళ్ల సక్రమంగా రుణం చెల్లించిన తర్వాత, ఎక్కువ మొత్తంలో రుణం తీసుకున్న వాళ్లు ఐదేళ్లు పూర్తిగా రుణం చెల్లించిన తర్వాత సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాకు జమ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఇది ఎస్‌సిలకు తీరని అన్యాయంగా పరిణమిస్తుంది. ఈ విధానం పట్ల ఎస్‌సి సామాజిక తరగతి ప్రజలు మండిపడుతున్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి బ్యాంకు రుణంతోపాటు సబ్సిడీని మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎస్‌సిలపై ప్రభుత్వం వివక్ష

- ఎమ్‌డి.ఆనంద్ బాబు, కెవిపిఎస్, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి.

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సిలపై ఆర్థిక వివక్షతను చూపుతోంది. అందుకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న బ్యాంకు లింక్ సబ్సిడీ రుణాలే నిదర్శనం. బిసి కార్పొరేషన్ లో ముందస్తు సబ్సిడీ రుణాలు అందిస్తుంటే.. ఎస్‌సి కార్పొరేషన్‌లో మాత్రం బ్యాక్ ఎండ్ సబ్సిడీ విధానాన్ని అమలు చేయడం విడ్డూరంగా ఉంది. వెంటనే ఫ్రంట్ ఎండ్ సబ్సిడీ విధానాన్ని ఎస్‌సి కార్పొరేషన్ రుణాల మంజూరు లో అమలు చేయాలి. లేదంటే దళితులను కూడగట్టి ఉద్యమిస్తాం.

రుణాలు చెల్లించడం లేదని

- కె. తులసీదేవి, ఇడి, ఎస్‌సి కార్పొరేషన్, కర్నూలు జిల్లా



లబ్ధిదారులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం లేదు. అందువల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారుతుంది. రూ. రెండు లక్షల లోపు రుణాలయితే రెండేళ్ల వరకు రుణాల కంతులు చెల్లించాక సబ్సిడీ వేస్తారు. ఆపై ఎక్కువ మొత్తంలో రుణం తీసుకున్న వారికి రుణం మొత్తం చెల్లించాక చివరలో సబ్సిడీని వేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నాయి.



సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి

నన్నూరులో సిసి రోడ్డుకు శంకుస్థాన


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామం పరిధిలోని రాగమయూరి కాలనీలో రూ పది లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరును కోరారు . గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, టిడిపి మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు విజయుడు, ఖాజామీయా, శంషుద్దీన్ కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్. షర్మిల పర్యటన వాయిదా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 11న పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కర్నూలు జిల్లా పర్యటన వాయిదా పడినట్లు సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జిలాని బాష మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి పర్యటన తేదీని త్వరలోనే వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.



క్రీడాకారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పత్తికొండ

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ అండర్ - 19 కి పత్తికొండ పట్టణానికి చెందిన ఇలియాస్‌బాష, రసూల్, ముఖేష్ ఎన్నికయ్యారు. మంగళవారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 9 ,10 ,11 తేదీలలోని నాగపూర్ లో జరిగే క్రికెట్ ,టెన్నిస్ బాల్ టోర్నమెంట్ కు వెళుతున్న క్రీడాకారులకు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి ఆఫీస్ ఇంచార్జ్ హరినాథ్ గౌడ్, పెద్దహుల్తి సర్పంచి తిప్పన్న, టిడిపి నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఆశావర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. కర్నూలు 23వ వార్డు శ్రీరామ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ దగ్గర మేడే వారోత్సవాలను పురస్కరించుకొని ఆశా వర్కర్లు మేడే కార్మిక సిఐటియు జెండాను ఆవిష్కరించారు. జెండావిష్కరణ కార్యక్రమానికి ఎం.పద్మావతి అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు పతాక ఆవిష్కరణ చేసి ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వారి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. దశలవారీగా సిఐటియు అనేక పోరాటాలు చేసిన సందర్భంగా కొన్నిడిమాండ్లను పరిష్కరిస్తామని గతంలో వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. తర్వాత వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని మాట తప్పిందన్నారు. కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలన్నారు. పని భద్రత కల్పించి ఆశా వర్కర్లను పర్మనెంట్ ఉద్యోగులుగా చేయాలన్నారు. ఆశా వర్కర్లకు 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి వారికి భద్రత కల్పించాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి వర్తించే విధంగా చేయాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశలుగా మార్పు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం మే నెల 20న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వార్డు నాయకులు ఆశా వర్కర్లు పద్మావతి, నాగమణి, బి నాగమ్మ ,ఎ. వెంకటరమణమ్మ, ఆశా బి, శాంత కుమారి, నరసమ్మ పాల్గొన్నారు.

20న సమ్మె జయప్రదం చేయాలి

సి బెళగల్ : ఈ నెల 20 న దేశ వ్యాప్తంగా జరిగే ఆశా వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని ఆశా కార్మికులను సిఐటియు డివిజన్ నాయకులు మోహన్ కోరారు. మంగళవారం ఆశా వర్కర్లతో సమీక్షించారు. సిహెఒ మహేశ్వరమ్మ కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలిచాలని జీతాలతో జీవితాలు సాగిస్తున్నారని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారన్నారు. మన సాధనకు ఈ సమ్మె గుణపాఠం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశాలు పాల్గొన్నారు.

గర్భవతులు, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి గర్భిణీని 12 వారాలలోపు నమోదు చేసి వారికి ఇవ్వాల్సిన సేవలు సకాలంలో పొందేలా చూసి ప్రతి కాన్పు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అయ్యేలా చూడాలని తెలిపారు. సంచార చికిత్స కార్యక్రమం అధికారి డాక్టర్ రఘు మాట్లాడుతూ గర్భవంతుల గృహ సందర్శన చేసి ఎవరు రక్తహీనతతో ఉన్నారో గుర్తించి వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని, గర్భిణీలు, బాలింతలు వారి కుటుంబ సభ్యులకు తల్లి పాల ప్రముఖ్యతపై అవగాహనా కల్పించాలన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కన్సల్టెంట్ సుధాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు ఫ్లోరోసిస్ వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. సాధరణంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వలన దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారడం, కిడ్నీ సంబంధిత వ్యాధులు , ఎముకలు గుండ్రంగా వంగిపోయి కీళ్ళు నొప్పి రావడం, కండరాల బలహీనత పడడం, ప్రేగు గోడలు దెబ్బతిని పోషకలు , ఖనిజలవణాలు శోషణ జరగక రక్తహీనతకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. దప్పిక తీరకపోవడం, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. బీడీ, చుట్ట, పాన్, పాన్ మసాలా వంటివి తినడం వలన ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. మల్టివిటమిన్, ఐరన్, జింక్, క్యాల్షియం, విటమిన్ సి ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అనంతరం బాధితులకు ఉచితంగా మల్టీ విటమిన్ ,విటమిన్-సి మాత్రలను అందించారు. ఈ కార్యక్రమములో వైద్యులు డాక్టర్. ఆనందరావు , ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్ కుమార్, పర్యవేక్షకులు నాగరాజు, మద్దమ్మ, ఆశా కార్యకర్తలు, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

గర్భవతుల ఆరోగ్యం పై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : గర్భవతుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆశ వర్కర్లను సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గర్భవతులు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నాగరాజు , సామాజిక ఆరోగ్య అధికారి రాధమోహన్, విజయలక్ష్మి, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు మంగమ్మ, ఆనమ్మ ,ఆశా కార్యకర్తలు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పారిశుద్ధ్య కార్మికులు


విధుల నుండి తొలగించకండి

వెల్దుర్తి ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి - వెల్దుర్తి : మమ్ములను విధుల నుండి తొలగించకండి సారు అని న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కృష్ణవేణి, ప్రశాంతి, రాధలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతూ తమను విధులలోకి తీసుకొనకపోతే కుటుంబ పోషణ కష్టమవుతుందని పురుగుల మందే మాకు శరణ్యమన్నారు. కరోనా కష్టకాలంలో కూడా కుటుంబానికి దూరమై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహించామన్నారు. తమను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు రాజకీయ నాయకులు జోక్యం కలగచేసుకుని యధావిధిగా విధులలో కొనసాగించాలని కోరారు.

కీర్తన అనాధ ఆశ్రమాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్



జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం కర్నూలు వెంకటరమణ కాలనీలోని కీర్తన అనాధ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో తనిఖీ చేపట్టారు. అనంతరం అనాధ ఆశ్రమంలో రికార్డులు సరైన రీతిలో నిర్వహించాలని అలాగే పరిశుభ్రతను పాటించాలని అనాధాశ్రమానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

నేటి నుండి కౌలు రైతులకు గ్రామసభలు



ప్రజాశక్తి- సి బెళగల్ : నేటి నుండి మండలంలోని గ్రామాల వారీగా కౌలు రైతులకు గ్రామ సభలు ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సి బెళగల్ లో, గురువారం బురాన్ దొడ్డి, శుక్రవారం కంభదహాల్, 12 సోమవారం పలుకు దొడ్డి, మాలసోమాపురం, 13 న కొండాపూర్, 14 న కొత్తకోట, 15 యనగండ్ల, 16 న పోలకల్, 17 న బ్రాహ్మణ దొడ్డి లో గ్రామ సభలు ఉంటాయన్నారు. వ్యవసాయం సంబంధ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుపై అధికారుల సలహాలు తప్పక పాటించాలని రైతులకు సూచించారు.



విద్యుదాఘాతంతో

ఇద్దరు యువకులు మృతి

- షామియానా పనులు చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి - కౌతాళం



మృతి చెందిన యువకులు

కూలి పనులకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఇద్దరు దళిత యువకులు మృతి చెందిన సంఘటన మండలంలోని ఉరుకుంద గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కూలి పనులకు కూడా కలిసిమెలిసి వెళ్లిన బావ బామ్మర్దులు మృత్యువులో కూడా కలిసి వెళ్లిన విషాద సంఘటన ఇది. ఈ ఘటన మండలంలోని ఉరుకుంద గ్రామంలో దళిత కుటుంబాల్లో చోటు చేసుకోవడం అందరినీ కలిచి వేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉరుకుంద గ్రామానికి చెందిన తిక్కన్న, నాగమ్మ దంపతులకు నలుగురు కుమారులు. అందులో మూడో కుమారుడు హరిజన మహేంద్ర (22), ఈరమ్మ, విజయ్ కుమార్‌ల కుమారుడు హరిజన సునీల్ కుమార్ ఏనాని (25) కూలి పనులకు వెళ్లారు. మండలంలోని ఉరుకుంద గ్రామంలో ఆర్యవైశ్య సత్రం వద్ద ఉన్న కల్యాణం మండపంలో బుధవారం వివాహ వేడుక జరగనుంది. ఈ వివాహం నిమిత్తం షామియానాలు (టెంటు) పనులు చేస్తుండగా చూసుకోకుండా 33కెవి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. సునీల్ కుమార్ ఏనానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాలను కౌతాళం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అల్లర్లకు తావివ్వొద్దు

- సిఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న సిఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

దేవర ఉత్సవంలో గొడవలు సృష్టిస్తే పోలీసు దెబ్బ రుచి చూపిస్తామని సిఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని శుక్రవారంపేటలో వెలసిన మారెమ్మ ఆలయం వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని శుక్రవారం పేటలో మారెమ్మవ్వ దేవర ఉత్సవం మంగళవారం ప్రారంభమైందన్నారు. రెండు రోజుల పాటు జరిగే దేవర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు. బంధువులు, ఇతరులు ఎక్కువ సంఖ్య లో వచ్చే అవకాశం ఉందని, సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గొడవలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం, నాటుసారా తాగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసుల నమోదుకు అవకాశం ఇవ్వవద్దని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు దుర్గప్ప, తిమ్మప్ప, హుస్సేని, మునెప్ప, నాగరాజు, బాలు ఉన్నారు.

'ఈఎల్స్' మంజూరు చేయాలి : బిటిఎ

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయాలని బిటిఎ జిల్లా అధ్యక్షులు భాస్కర్ కోరారు. మంగళవారం ఆదోనిలో డిఇఒ శామ్యూల్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు పాఠశాలకు వేసవి సెలవులు ఉంటాయని ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఉత్తర్వులు జారీ చేసిన రోజే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల చేశారని చెప్పారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులనుద్దేశించి మీరిచ్చిన ఉత్తర్వులను మీరు తుంగలో తొక్కారన్నారు. అంతలోనే కొత్త ఉత్తర్వులు జారీ చేసి రెమిడియల్ తరగతులు నిర్వహించాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు గందరగోళ వాతావరణం సృష్టించారన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థులు ఇంటి దగ్గరే విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించినట్లు చెప్పారు. ఇప్పుడు ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కడం సమంజసం కాదన్నారు.

ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి

- 20న సమ్మెను జయప్రదం చేయండి - సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో డాక్టర్ అఫ్రోజ్ జహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నారాయణస్వామి, ఆశాలు

ఆశావర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, ఆశాల మండల అధ్యక్షులు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఖాళీగా ఉన్న నియామకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు, పలు యూనియన్ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆశాల డిమాండ్లు నెరవేర్చాలని డాక్టర్ అఫ్రోజ్ జహాన్‌కు వినతిపత్రం అందజేశారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ పద్మ, ఆశాలు మాధవి, ఈరమ్మ, దీనమ్మ, కవిత, రాధమ్మ, సాయి దుర్గ, కవిత పాల్గొన్నారు. **కోసిగి** ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్‌కు సిఐటియు నాయకులు రాముడు, వీరేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ, సుజాత, లక్ష్మి సమ్మె నోటీసు అందజేశారు. **హాలహర్వి** మండలంలోని హాలహర్వి ప్రైమరీ హెల్త్ సెంటర్, అర్థగేరిలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ వన్నూరు వలీ, గంగాధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న స్కీం వర్కర్లు, ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. పారితోషికం పేరుతో ఆశావర్కర్ల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఏళ్ల తరబడిగా వైద్య సేవలు అందిస్తున్న ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కృష్ణ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ఆశాలు శివమ్మ పాల్గొన్నారు.



కోసిగిలో సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు



హాలహర్విలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మైనార్టీ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులో ఉన్న మైనార్టీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేదుకు చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మంగళవారం కాలనీని సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ నాయకులు ఇక్బాల్, అజిం ఖాన్, మైనార్టీ కాలనీ వాసులు అస్లాం మాట్లాడారు. మెయిన్ రోడ్డు చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కౌన్సిల్‌లో తీర్మానం చేయించి రోడ్డు వేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయించి నిర్మాణం చేపట్టాలని కోరారు. రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పనులు చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ కృష్ణ

ఘనంగా దేవర ఉత్సవం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శుక్రవారం పేటలో వెలసిన మారెమ్మ అవ్వ దేవర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు ఉత్సవ కమిటీ సభ్యులు దుర్గప్ప, నాగరాజు, తిమ్మప్ప తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సిఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు పూలమాల, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజ వంటి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారుజామున అమ్మవారికి బలి అర్పణ, బోనాలు, నైవేద్యం సమర్పణ ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా డీఎస్పీ హేమలత సారథ్యంలో సిఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు మునెప్ప, నీలకంఠప్ప, బాలు, అప్సర్ బాష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

రోడ్డు గుంతలమయం

- ఇబ్బందులు తప్పవంటున్న వాహనదారులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద రైల్వే గేట్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వర్షం కురిస్తే నీరు పారేందుకు అవకాశం లేక ఎక్కువ కాలం నిలిచి ఉంటోంది. చిన్నపాటి వర్షమొచ్చినా నీరు నిలిచి రోడ్డు బురదమయమవుతోంది. నడపలేకపోతున్నామని, బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గుంతలు తెలియక వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సందర్భాలూ ఉన్నాయి. ఈ రోడ్డు వెంట ధణాపురం, చాగి, నారాయణపురం, ఆలూరు కమ్మరిచేడు, కొల్లబావి, శంకర్ నగర్, లేబర్ కాలనీ, జగనన్న కాలనీ ప్రాంతాల వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే భాష్యం స్కూల్, ఆర్‌సిఎం హై స్కూల్ ఉండడం వల్ల విద్యార్థులు కూడా ఈ రోడ్డు గుండానే వస్తున్నారు. హైవే నిర్మాణ పనులకు టిప్పర్ లారీలు మట్టి తరలింపు కోసం ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గుంతలు ఉండడం వల్ల వాహన రాకపోకల సమయంలో గుంతలు మరింత వెడల్పు అవుతున్నాయని పేర్కొంటున్నారు. కనీసం గ్రావెల్‌తోనైనా గుంతలు పూడ్చి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న రైల్వే గేట్ రోడ్డు



పంది పిల్లకు పాలు ఇస్తున్న కుక్క

తల్లి ప్రేమ గొప్పది..!

- జాతి వేరైనా మానవత్వం చాటిన కుక్క

ప్రజాశక్తి - కౌతాళం

తల్లి ప్రేమ గొప్పదని చాటి చెప్పింది ఓ కుక్క. జాతి వేరైనా పంది పిల్లకు పాలు ఇచ్చి తల్లి ప్రేమను చూపింది. పందికి, కుక్కకు ఉన్న వైరం అందరికీ తెలిసిందే..! వాటి వైరాన్ని పక్కన పెట్టి కుక్క మానవత్వం చాటిన సంఘటన స్థానిక ఒక దళిత కాలనీలో ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనిపించింది. ఓ కుక్క పంది పిల్లకు పాలు తాపించి తన ప్రేమను చాటి చెప్పింది.

ఉద్యోగ, కార్మిక హక్కుల సాధనకు పోరాటం

- చిప్పగిరిలో సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉద్యోగ, కార్మికుల హక్కుల సాధనకు సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి తెలిపారు. మంగళవారం చిప్పగిరిలో సుంకప్ప అధ్యక్షతన సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మారుస్తోందని తెలిపారు. ఇది కేవలం కార్మిక చట్టాలకు తూట్లు పొడవడానికే తప్ప కార్మికులకు మేలు చేసేది కాదన్నారు. కష్టపడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కూడా ఈ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ కార్మికులను వెట్టిచాకిరీ దిశగా నెడుతున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల రక్షణకు ఈనెల 20న సిఐటియు ఆధ్వర్యంలో జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు చిప్పగిరి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చంద్రయ్య, కార్యదర్శిగా సుంకప్ప, ఉపాధ్యక్షులుగా బాలరంగమ్మ, సహాయ కార్యదర్శిగా మాధవి, కోశాధికారిగా శివ, కమిటీ సభ్యులుగా దీనమ్మ, గోవిందమ్మ, రామాంజిని, రాఘవ, నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సమయపాలన పాటించాలి

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప

ప్రజాశక్తి - ఆదోని

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేటట్లు చూడాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు కెవిపిఎస్ నాయకులు పరమేష్‌తో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తిక్కప్ప మాట్లాడారు. పట్టణంలోని 35వ వార్డు అమరావతి నగర్‌లో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్నారు. పనుల నిమిత్తం వచ్చినవారు తిరిగి వెళ్తున్నారని తెలిపారు. సచివాలయంలో నెలల నుంచి కంప్యూటర్ కూడా పని చేయడం లేదని చెప్పారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేటట్లు, ఆ విధుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కంప్యూటర్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని తెలిపారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న తిక్కప్ప

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - హోళగుంద

ఈనెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియ మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చి వేసి కార్మికులకున్న సమ్మె హక్కును, ట్రేడ్ యూనియన్ హక్కును సమూలంగా మార్చి వేసి బానిసలుగా మార్చి వేస్తోందని విమర్శించారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వారి లాభాల కోసమే కార్మికులను బలి పశువులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. ఆశాలు సలోమి, మంగమ్మ, ఫాతిమా, మహాలక్ష్మి, సిద్ధ లింగమ్మ పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

20న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుబేదా ఆశ వర్కర్లను కోరారు. లద్దగిరి పిహెచ్‌సిలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశలుగా మార్చాలన్నారు. రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ ఆఫీసర్ భాస్కర్‌కు, నోడల్ ఆఫీసర్‌కు అందజేశారు. ఆశ, సరోజ, సువర్చల, సరస్వతి, రేణుక, లక్ష్మి, సుజాత, కృప, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ చేతులమీదుగా 'బాలలలోకం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న 69వ పుస్తకం 'బాలల లోకం'ను మంగళవారం డిఇఒ శామ్యూల్ పాల్ చేతుల మీదుగా ఆదోనిలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో ఘనంగా జరిగింది. ఆదోని డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒల సమావేశంలో కవి గద్వాల సోమన్న పుస్తకావిష్కరణ చేపట్టారు. ఎంసి.గిడ్డయ్య, ముగతి ప్రతాప్, టి.ఆంజనయ్య, ఎం.రాజు పాల్గొన్నారు. పుస్తక కృతికర్త గద్వాల సోమన్నను డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్, అధికారులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఇఒ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పట్టించుకోని అధికారులు

- ఇసుక తవ్వడంతో వేదవతి నదికి గుంతలు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం ఇసుకను అక్రమంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక రవాణాను నియంత్రించి, వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారే ఇసుక అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు మండలంలో బాహటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళ జె.హోసళ్లి, హాలహర్వి, గూళ్యం గ్రామ శివారుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండల వాసులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వేదవతి నదిలో ఇసుకను తీయడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వేదవతి నది నుంచి వేరే మండలాలకు ఇసుక అక్రమంగా తరలిస్తూ ఉంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ నదికి ఇసుక రీచ్ లేదు. అక్రమార్కులు అధిక ధరలకు అమ్ముకోవడానికి పోటీ పడి మరీ రాత్రిళ్లు గ్రామస్తులకు నిద్ర లేకుండా పెద్ద పెద్ద సౌండ్‌లతో వెళ్తున్నారు. వీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

అప్రమత్తతతో తప్పిన తాగునీటి ముప్పు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 40వ వార్డులో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిన వెంటనే కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ చొరవ చూపడం, మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టడంతో తాగునీటి సమస్య తప్పింది. మంగళవారం తెల్లవారుజామున నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితిని గమనించి కౌన్సిలర్ ఫయాజ్ వెంటనే మున్సిపాలిటీ లైన్‌మేన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు రామ్మూర్తి, ఎఇ జనార్ధన్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. లైన్‌మేన్ వర్కర్లను ఘటన స్థలానికి పంపి, వాటర్ వాల్ సెట్టర్‌కు తక్షణమే మరమ్మతు చేయించారు. తక్కువ సమయంలోనే మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. తాగునీటి లాంటి మౌలిక అవసరాల్లో ఏ చిన్న ఆటంకాన్ని కూడా సహించలేమని, ప్రజలు ఇప్పటికే రెండు సార్లు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారని కౌన్సిలర్ ఫయాజ్ తెలిపారు. మూడోసారి సమస్య తలెత్తడంతో వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపాలిటీ తరపున ముందస్తు నిర్వహణ, పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



మరమ్మతులు చేయిస్తున్న డిఇ రామమూర్తి

గుండ్లకొండ వద్ద సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలి

- రైతుసంఘం, సిపిఐ వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మంగళవారం దేవనకొండ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు ఎపి రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో హంద్రీనీవా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసారావు, బండపల్లి మాజీ సర్పంచి శ్రీరాములు, గుడిమిరాళ్ల తిమ్మప్ప, మాచాపురం వీరన్న, ఎపి రైతు సంఘం మండల నాయకులు వై.కండప్ప, ఎమ్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. మండలంలో హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా దాదాపు 46 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఇప్పటివరకు హంద్రీనీవా ద్వారా మండలంలోని కొన్ని గ్రామాల రైతులకు మాత్రమే సాగునీరు అందుతోందన్నారు. దాదాపు 75 శాతం గ్రామాల రైతులకు ఇప్పటివరకు హంద్రీనీవా ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, కె.వెంకటాపురం, మాదాపురం, బంటుపల్లి, చెల్లెల చెలిమల, బేతపల్లి, బండపల్లి, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా సాగునీరు మళ్లించాలని కోరారు. రైతు సంఘం నాయకులు సురేష్, వెంకటేష్, వీరాంజనేయులు, మాబు హుసేని, చిరంజీవి, ఆంజనేయ పాల్గొన్నారు.



రైతులతో కలిసి ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు